# శివయ్య సన్నిధిలో ఆకాశ దీపం

## - కార్తీకమాసం ప్రారంభం

**శ్రీకాళహస్తి, నవంబర్ 13 ప్రభాతవార్త** కార్తీక మాసం.. తెలుగు సంవత్స రంలో ఎనిమిదవ నెల. పౌర్ణమి రోజున కృత్తికా నక్షత్రం అనగా చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కలసిన రోజు కావున ఈనెల కార్తీకం. శివుడు, మరియు విష్ణువు లిద్దరి పూజకోసం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆకాశదీపాన్ని వెలిగిస్తున్న ఇఓ,చైర్మెన్

చాలాపవిత్రమైనది. ఈ కార్తీకమాసం స్నానాలకు మరియు వివిధ వ్రతములకు శుభప్రదమైనది. ఈ నెల 13 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీకమాసం ఉంటుంది. కార్తీకమాసం గురించి స్కంధ పురాణంలో ఈవిధంగా పేర్కొనబడింది.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తిక మాసం సందర్భంగా సోమవారం రాత్రి కోటమండపం వద్ద ఆకాశదీపాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సంకల్పం చేయగా ఇఓ కె వి సాగర్‌బాబు దీపం వెలిగించి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి సతీమణి బియ్యపు వాణి టెంకాయ కొట్టి ఆకాశ దీపం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కార్తిక మాసం శివుని ఆలయంలో దీపం పెడితే మంచిదనే నమ్మకం ఉంది. దాంతో మొదటి రోజు నుంచే ఆల యంలో దీపాలు వెలిగించటం మొదలు పెట్టారు. సోమవారం రావటంతో ఎంతో ప్రాధాన్యత చోటు చేసుకుంది. కార్తీకమాసం శివకేశవులకి ప్రీతిపాత్రం ఈమసంలో దేశంలో నలుమూలలా ఉన్న ఆలయాల్లో రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చనలు, రుద్రపూజలు విశేషంగా జరుపుతారు. విశేషార్చనలు జరిపే భక్తులకు సదాశివుడు అనుగ్రహించి వారి అభీష్టాలు నెరవేర్చుతాడని నమ్మకం. అందుకే స్వామికి 'అశుతోషుడు' అన్న పేరు వచ్చింది.' అభిషేక ప్రియ శివః' శివునికి అలంకారాలతో రాజోపచారాలతో, నైవేద్యములతో పనిలేదు. మనస్సులో భక్తి ఉంచుకుని శివుడిని ధ్యానిస్తూ చేసే అభిషేకంతో శివుడు ప్రీతిపాత్రుడవుతాడు. శివాభిషేకం అన్ని దోషాలను పోగొట్టి సకల శుభాలను కలిగిస్తుంది. ఈమాసంలో శివార్చన చేసే వారికి గ్రహదోషాలు, ఈతిబాధలు ఉండవు. శివునిని బిల్వపత్రాలు(శ్రీవృక్ష పత్రములు)తో పూజించిన స్వర్గంలో లక్ష సంవత్సరాలు జీవించవచ్చును ప్రతీతి. ప్రదోషకాలంలో పరమేశ్వరుడు, ఏకకాలంలో రెండు రూపాలని ప్రదర్శిస్తూ ఎడమభాగాన పార్వతీ, కుడిభాగాన పరమేశ్వర రూపంగా అర్ధనారీశ్వరునిగా దర్శనమిచ్చే సమయమే ప్రదోషకాలంగా చెప్పబడుతుంది. తులసీ దళాలతో శ్రీమహా విష్ణువుని కార్తీకమాసంలో పూజిస్తే ముక్తిదాయకం. ఈమాసంలో విష్ణువు దామోదర నామంతో పిలవబడుతాడు.' కార్తీక దామోదర ప్రీత్యర్థం' అని ఈ మాసాన వ్రత దీక్ష ఆచరించాలి. తులసి చెంత హరిపూజ పుణ్యప్రదం. సత్యనారాయణవ్రతం, విష్ణుసహస్రనామపారాయణం చేయడం శ్రేష్ఠం. శివానుగ్రహానికి, విష్ణువు అనుగ్రహానికి ఈమాసం ఎంతో మంచిది. ఈమాసం మొదటి నుంచి సూర్యోదయానికి పూర్వమే నదీస్నానం అత్యంత ఫలప్రదం. కార్తీకనదీ స్నాన విషయంలో ఆరోగ్యసూత్రం కూడా ఇమిడి ఉంది. నదీజలాలు కొండలలోను, కోనలలోను, చెట్టుపుట్టలను తాకుతూ ప్రవహిస్తాయి. అలా ప్రవహించడం ద్వారా ఎన్నో వనమూలికల రసం నదీ జలాల్లో కలుస్తుంది. ఈమాసంలో గృహిణులు, యువతులు వేకువనే స్నాం చేసి తులసికోట ముందు దీపారాధన చేసి గౌరీదేవిని పూజిస్తే ఈశ్వరాను గ్రహంతో సౌభాగ్యాన్ని, సకల శుభాలను పొందుతారు.

కార్తీకమాసం మొదలు నుంచే 'ఆకాశదీపం' ప్రారంభమవుతుంది. ఉభయ సంధ్యలలో గృహమునందు, పూజా మంది రంలోను, తులసి సన్నిధిలోను, ఆలయాల్లోను దీపా రాధన, ఇహ, పర సౌఖ్యాలను కలగ జేస్తుంది. ఈమాసం దీపారాధనకి ప్రశస్త్యం. దీపమందు ఆవునెయ్యి ఉత్తమం. మంచి నూనె మధ్యమం. ఏకాదశి అత్యంత విశేషమైనది. ఉత్థానైకాదశి కార్తీకశుద్ధ ద్వాదశి కార్తీక పౌర్ణమి వంటి రోజులు ఎంతో ప్రసిద్ధి.



## ఆల్ ఇండియా మెడికల్ సైన్స్ ఫలితాల్లో 304 ర్యాంక్ సాధించిన పవిత్ర

**రాజవొమ్మంగి, నవంబరు 13, ప్రభాతవార్త** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం రాజవొమ్మంగి గ్రామానికి చెందిన ముప్పన పవిత్ర ఆల్ ఇండియా మెడికల్ సైన్స్ (ఎయిమ్స్) ఎం.డి.ఎంట్రన్స్ పరీక్షల్లో ఈనెల 11 తేదీన వెలువడిన ఫలితాల్లో 99.5 మార్కులను సాధించి ఆల్‌ఇండియాలో 304 ర్యాంక్‌తో ప్రతిభను చాటింది. హైద్రాబాద్ ఉస్మానియా వైద్య కళాశాలలో యం.బి.బి.యస్.చదువు పూర్తి కావడం జరిగిందని ముప్పన కేశవ్ తెలిపారు. డిల్లీ ఎయిమ్స్ వైద్య కళాశాలలో గైనకాలజీ చదవడం తన ఆశయమని పవిత్ర అన్నారు. రాజవొమ్మంగి గ్రామ రైతు కుటుంబమైన ముప్పన అమర్నాధ్, హైమావతి దంపతుల మొదటి సంతానమైన పవిత్ర ప్రాధమిక విద్యాబ్యాసం రాజవొమ్మంగిలో జరిగింది. తదుపరి రాజహేంద్రవరంలో చదువు కొనసాగింది. మండలంలో అన్ని గ్రామాలవారికి ముప్పన వారి కుటుంబం సుపరిచితులు. పవిత్రకు మండలంలో పలువురు అభినందనలు తెలిపారు.

# నేటి నుండి శతకోటి లలిత కుంకుమార్చనతో మహాశక్తి యాగం

**- శ్రీ పీఠం వేదికగా 30 రోజుల పాటు మహాశక్తి యాగానికి శ్రీకారం**

**- స్వామి పరిపూర్ణానంద సరస్వతి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, కాకినాడ రూరల్, నవంబర్ 13, ప్రభాతవార్త :** మండలంలోని రమణయ్యపేట శ్రీపీఠంలో కొలువైన శ్రీ ఐశ్వర్యాంబికా సమేత సుందరేశ్వర స్వామి గోశాల ప్రాంగణంలో పూజ్యశ్రీ దయానంద స్వామి ఆశీస్సులతో స్వామి పరిపూర్ణానంద ఆధ్వర్యంలో దేశ చరిత్రలో మొట్ట మొదటిసారిగా కార్తీకమాసం చివరి వరకూ మహాశక్తి యాగం నిర్వహిసు ్తన్నట్లు స్వామి పరిపూర్ణానంద పేర్కొన్నారు. సోమవారం యాగశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో స్వామి పరిపూర్ణానంద యాగం యొక్క విశిష్ట తను, సుమారు పదివేల భక్తులచే నిర్వహించే శతకోటి లలిత కుంకుమార్చన గురించి వివరాలను విలేఖరులకు వెల్ల డించారు. ఈ సమావేశంలో స్వామిజీ మాట్లాడుతూ శ్రీ పీఠం వేదికగా వందకోట్ల కుంకుమ అర్చన దేశంలోనే జరగడం, బగలాముః దేవతను దేశచరిత్రలో ఇది ఒక మైలు రాయిగా నిలుసు ్తందన్నారు. ముప్పై రోజుల పాటు అమ్మవారి దీక్ష తీసుకుని ఉదయం 8గంటల నుండి మహాశక్తి యాగం మొదలుపెట్టి అమ్మవారికి 27 నక్షత్రాలకు శాంతి, అతి రు ద్రయాగం జరుగుతుందని, అమ్మవార్లను ఆవాహనం చేసి జపం, తర్పణం, హోమాలను నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీరోజూ సాయంత్రం 7గంటల నుండి 8గంటల వరకు బగలామాత అమ్మవారికి 41 రకాల వనమూలికలతో హోమం నిర్వహిస్తామని తెలిపారు. కార్తీకమాసం ముప్పై రోజుల పాటు ప్రతీరోజూ సాయంత్రం గోమయంతో ప్రత్యేకంగా తయారు చేసిన ప్రమిదలను ఉపయోగించి కోటి దీపార్చన దృఢ సంకల్పంతో చేసు ్తన్నామని తెలిపారు. ప్రతీరోజూ కుంకుమార్చన అనంతరం భక్తులకు మహా అన్న ప్రసాదాన్ని వితరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ యాగంలోరాష్ట్రం నలుమూలల నుండి పీఠాధిపతులు, స్వామీజీలు పాలొ ్గంటారన్నారు.దేశ ంలోని ఏడుపాయల నుండి సేకరించిన గంగను తీర్థప్రసాదంగా భక్తులకు ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేశామని తెలిపారు. మానవ ప్రయత్నాలకు అతీతంగా మానవాళికి మేలు జరగాలని ఈ కోటి కుంకుమ అర్చన యాగం చేయాలని సంకల్పించమని అన్నారు. దైవ బలంతో మాత్రమే ఈ యాగం పూర్తి స్థాయిలో సఫలీకృతం అవుతుందన్నారు. ఈ యాగం కాకినాడలో నిర్వహించడం కాకినాడ ప్రజలు చేసుకున్న పూర్వజన్మ సుకృతం అన్నారు. మంగళవారం



సాయంత్రం నాలుగు గంటలకు కాకినాడ భానుగుడి సెంటర్ అయ్యప్ప స్వామి ఆలయం నుండి ఊరేగింపుగా ఉత్సవ మూర్తులను తీసుకుని రావడం జరుగుతుందన్నారు. లోక కళ్యాణార్థం, సకల దోష నివారణకు, అఖండ శక్తి ప్రాప్తికి నిర్వహించే శతకోటి లలిత కుంకుమార్చన , మహాశక్తి యాగంలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

# నేటి నుంచి శ్రీకాళహస్తిలో కోటి బిల్వార్చన, కోటి కుంకుమార్చన - కార్తీక దీపం ఏర్పాటు

**శ్రీకాళహస్తి,నవంబర్ 13 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నేటి నుంచి (మంగళవారం) స్వయంభుగా వెలసిన వాయులింగేశ్వరునికి కోటి బిల్వార్చన,దేవేరిజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి కోటి కుంకుమార్చన, సాయంత్రం కార్తీక దీపం వెలిగించటం జరుగుతుందని ఆలయ ఇఓ కెవి సాగర్‌బాబు సోమవారం తెలిపారు. సోమవారం కార్తీక మాసం ప్రారంభానికి ముందు సామూహిక కేదార గౌరీ వ్రతం నిర్వహించటం ఆనవాయితి అని ఈ మేరకు సోమవారం నిర్వహించిన సామూహిక కేదార గౌరీ వ్రతానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారని, మహిళా భక్తులు మనోభావాలకు అనుగుణంగా చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సూచనలతో చేపట్టామని వేల మంది భక్తులు వచ్చిన ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనాలు జరిగాయని వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో పంచ భూతలింగాల్లో మనిషికి ఆయువు పట్టు అయిన వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంగా విరాలజిల్లుతుందన్నారు.12 సంవత్సరాల క్రితం ఈ ఆలయంలో స్వామి వారికి కోటి బిల్వార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేపట్టుటకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆలయంలో నిత్యం ధార్మికతతో పునీతం కావాలన్న లక్ష్యంతో చైర్మెన్ ఆదేశాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నామని ఇఓ వివరించారు. సాధారణంగా కార్తీక మాసంలో శివాలయాలకు భక్తులు విశేషంగా వస్తారని అంతేకాక శివాలయంలో దీపం వెలిగిస్తే ఎంతో పుణ్యం వస్తుందని, ప్రయోజనకరంగా ఉంటుందని చైర్మెన్



కోటిబిల్వార్చన, కోటి కుంకుమార్చన గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆది నుంచి దీపాలు వెలిగించే సంప్రదాయం ఉందన్నారు.ఈ ఏడాది కార్తీక మాసం పురస్కరించుకొని స్వామి వారికి కోటి బిల్వార్చన, అమ్మవారికి కోటి కుంకుమార్చనలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు.ఈ మేరకు మంగళవారం నుంచి ఆలయంలో స్వామి అమ్మవార్లకు కోటి బిల్వార్చన, అమ్మవారికి కోటి కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు.డిసెంబర్ 12న స్వర్ణమ్మకు నదీ హారతులివ్వటానికి సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నదీ హారతులను స్థానిక శాసనసభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డి సూచనలతో అమలు చేస్తున్నామని ఈ ఏడాది భారీ ఎత్తున నిర్వహించుటకు చైర్మెన్ ప్రతిపాదించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో 2012లో స్వామి వారికి కోటి బిల్వార్చన, అమ్మవారికి కోటి కుంకుమార్చన నిర్వహించినట్లు రికార్డుల్లో ఉందని చైర్మెన్ వివరించారు. అయితే చైర్మెన్ శ్రీనివాసులు ప్రతిపాదనపై స్పందించిన ఆలయార్చకులు, స్థలపతి,ప్రధానార్చకులు సూచిస్తూ ఈ మహత్తర కార్యక్రమం జరగాలంటే కనీసం వందమంది రుత్వికులు కావాలని అలాగే వేదపండితుల సారధ్యంలో పది రోజులు పడు తుందని వివరించగా అందుకు ఇఓ కెవి సాగర్ బాబు ఆమోదించారు. కార్తీక మాసం మహిళా భక్తు లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తెల్లవారు జాము 4గంటల నుంచే దర్శనాలు, మహిళా భక్తులకు కార్తీక దీపాలు వెలిగించుకొనుటకు ప్రత్యేక స్థలం కేటాయించాలని చైర్మెన్ సూచించారు.ఈ నెల 17న నాగుల చవితి సందర్భంగా ఆలయం ప్రత్యేక కార్య క్రమాలు ఏర్పాటు చేసినట్లు చైర్మెన్ వివరించారు. అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

## విజయవాడలో దీపావళికి హాల్‌చల్ చేసిన బంగారు మిఠాయిలు

**విజయవాడ,నవంబరు13,ప్రభాతవార్త ప్రతినిధి:** జిహ్వ కో రుచి,ఉంటే ఆహార పదార్థాల తయారీదారులు ఆ అభిరుచికి అనుగుణంగా వా ్యపార ప్రపంచంలో వింతలు సృష్టిస్తారు. కొనుగోలుదారులను ఆకట్టుకుంటారు. ప్రస్తుతం గత రెండు రోజులనుంచి విజయవాడ నగరంలో దీపావళి సందర్భంగా స్వీట్స్‌కు ఉండే డిమాండ్‌కు అనుగుణంగా మిఠాయి వ్యాపారులు నగరంలో నూతన తీపి పదార్థాన్ని అందుబాటులోకి తెచ్చారు.అవి బంగారం స్వీట్లు. వీటి రూ.వేలల్లో ఉన్నా,తీపి ప్రియులు వీటిపై ఆసక్తి చూపారు. దీపావళికి బాణా సంచాతో పాటు తీపి పదార్థాలకు డిమాండ్ ఉంటుంది. బంధువులకు,మిత్రులకు తీపి పదార్థాలను అంటే స్వీట్లు ఇస్తారు.విజయవాడలో దీపావళికి రకరాల స్వీట్లును మిఠాయి వ్యాపారులు అందుబాటులో ఉంచుతారు.కీలకంగా వారు తయారు చేసే మిఠాయిలు ఏటా ఒక ప్రత్యేకత ఉంటుంది.ఇందుకోసం ఉత్తరాది రాష్ట్రాలనుంచి స్వీటుతయారీదారులను ఇక్కడకు రప్పిస్తారు. వారిలో కీలకంగా బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రం నుంచి వచ్చేవారు అధికంగా ఉంటారు.ఈ ఏడాది వినూతన్నంగా బంగారు స్వీట్లు తీసుకుని వచ్చారు.ఈ మిఠాయిలపై 24 క్యారెట్ల బంగారంతో పూత పూసారు.దీంతో స్వీటు ప్రియులు వీటి కోసం బాగానే ఎగబడ్డారు. మార్కెట్లో ఈ ఏడాది బంగారం పూత పూసిన స్వీట్లు విజయవాడ నగరంలో ఆకర్షణీయంగా మారాయి.విజయవాడ నగరవాసులకు శుభకార్యాల సందర్భంలో బంగారు పూత పూసిన స్వీట్లు అందుబాటులో ఉంటాయి.

# అన్నమయ్య ప్రాజెక్టు వద్ద టిడిపి ధర్నా - కొట్టుకుపోయి రెండేళ్లు అవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

**రాజంపేట నియోజకవర్గ టిడిపి నేత గంటా నరహరి**

**రాజంపేట అర్బన్, నవంబరు 13 ప్రభాతవార్త** వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు కొట్టుకుపోతున్నా దిక్కులేదని, ఊర్లకు ఊర్లు సర్వస్వం కోల్పోయినా పట్టించుకునే దిక్కులేదని జగన్‌సర్కార్ అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని రాజంపేట నియోజకవర్గ టిడిపి నేత గంటా నరహరి ధ్వజమెత్తారు. ఆదివారం గంటా నరహరి ఆధ్వర్యంలో పెద్దఎత్తున తెలుగుదేశంపార్టీ నాయకులు, అన్నమయ్య ప్రాజెక్టు వరద బాధితులు ఆందోళన నిర్వహించారు. చెయ్యేరు ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా మోకాళ్లపై ఇసుకలో కూర్చుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా గంటా నరహరి విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్‌డ్యాం కొట్టుకుపోయి రెండేళ్లు కావస్తున్నా పునర్నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం ప్రభుత్వానికి సిగ్గులేదా అని ధ్వజమెత్తారు. సిఎం సొంత జిల్లాలోనే ఒక ప్రాజెక్టు కొట్టుకుపోతే దిక్కులేకపోతే ఇతర ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులపై ఇంత నిర్లక్ష్యం ఘోరమన్నారు. 22500 ఎకరాలకు నీరందించే ఒక ప్రాజెక్టు పునర్నిర్మాణం పట్ల జగన్ ప్రభుత్వం ఉదాసీనతగా వ్యవహరించడం సరి కాదన్నారు. రెండేళ్లపాటు ఆయకట్టు రైతులు పంటలు సాగుకు నోచుకోక ప్రభుత్వంపై శాపనార్థాలు పెడుతున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రాజెక్టులో నీరు లేకపోవడం వల్ల వేలాది ఎకరాల భూముల్లో పంటలు సాగు చేసేందుకు రైతులు భూగర్భజలాలు అడుగంటి ధైర్యం చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులను తక్షణం ప్రారంభించాలన్నారు.

# తిరుమల సమాచారం



## కల్పవృక్షవాహనసేవలో కళాబృందాల విన్యాసాలు

**తిరుపతి,నవంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుచానూరులో కొలువైన పద్మావతిఅమ్మవారికి జరుగుతున్న కార్తీకమాస బ్రహ్మోత్సవాల్లో సోమవారం కల్పవృక్షవాహనం ముందు వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమతమ అద్భుత విన్యాసాలను ప్రదర్శించారు. టిటిడి డిపిపి ఆధ్వర్యంలో 11 కళాబృందాల్లోని కళా కారులు సంగీత, నృత్యప్రదర్శనలతో అలరిం చారు. తిరుపతి ఎస్వీసంగీత నృత్యకళాశాల విద్యార్థులు వివిధ దేవతామూర్తుల అలంకరణలతో, పలు అన్నమయ్య సంకీర్తనలకు చక్కటి కూచిపూడి నృత్యప్రదర్శన చేశారు. తిరుపతికి చెందిన మహిళలు కోయడాన్స్(ఎరుకుల సానివేషదారణలో), నెల్లూరు గురుకృప కళాక్షేత్రంకు చెందిన కళాకారులు లక్ష్మీకాంతం నృత్యరూపకం ,తమిళనాడు సేలంకు చెందిన కళాకారులు వీరనాట్యం, గోపికనృత్యం, మేల విన్యాసం, వైలాట్యం, రిబ్బన్‌డ్యాన్స్, నెమలి డ్యాన్స్‌తో భక్తులను ఆకట్టుకున్నారు.

## నేడు లక్ష్మీకాసుల హారం ఊరేగింపు

**తిరుమల,నవంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుండి దేవేరి పద్మావతిఅమ్మవారికి లక్ష్మీకాసుల హారం పంపే శోభాయాత్ర ఊరేగింపు మంగళవారం ఉదయం తిరుమల నుండి మొదలవుతుంది. ప్రతి ఏటా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో గజవాహనం, గరుడవాహనసేవలకు సాక్షాత్తు శ్రీనివాసుడికి ఉన్న ఆభరణాల్లో విశిష్టమైనది, ప్రత్యేకత వున్న లక్ష్మీకాసుల హారాన్ని అమ్మవారికి పంపి అలంకరించడం పరిపాటి. ఈ సాంప్రదాయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పాటిస్తూ మంగళవారం ఉదయం ఆలయంలో శ్రీనివాసుడి మూల విరాట్టు పాదాలచెంత ఉంచి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం 8గంటలకు తిరుమల ఆలయం నుండి ఊరేగింపుగా బయలుదేరి తిరుచానూరుకు చేరుతారు. ఇక్కడ టిటిడి అధికారులు ఈ లక్ష్మీకాసులహారాన్ని పద్మావతి



అమ్మవారికి చేర్చి పద్మావతిఅమ్మవారికి నేటిరాత్రికి జరిగే గజ వాహనం,రేపు రాత్రికి జరిగే గరుడవాహనంలోఅలంకరిస్తారు.

## హనుమంతునిపై అలిమేలుమంగ ఉదయం కల్పవృక్షంపై కరుణామయి



**తిరుపతి,నవంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పట్టపురాణి తిరుచానూరులో కొలువైన పద్మా వతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో సోమ వారం రాత్రి అలిమేలుమంగ హనుమంత వాహనంపై భక్తులను కటాక్షించారు. సాయం త్రం నిత్యకైంకార్యలు ముగించుకున్న ఉత్సవ మూర్తి పద్మావతిని విశేషాభరణా లంకృతుల్ని చేసి వాహనంపై అధిరోహింప జేశారు. అమ్మవారు గజ, అశ్వ, కళాబృందాల నడుమ మంగళవాయిద్యాలతో ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తుల కర్పూర నీరాజనాలు అందుకున్నారు. భక్తులు పద్మావతి దేవీ నమోనమ: అంటూ నామస్మరణలతో తిరుచా నూరు మాఢవీధులు భక్తితో నిండిపోయాయి. ఈ వాహనసేవలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ గోవిందరాజులు, విఎస్ఒ బాలిరెడ్డి, పాంచరాత్ర ఆగమసలహాదారుడు శ్రీనివాసాచార్యులు, కంకణభట్టార్ మణికంఠస్వామి, అర్చకులు బాబుస్వామి, వేంపల్లి శ్రీనుస్వామి ,భక్తులు పాల్గొన్నారు. కార్తీకబ్రహ్మోత్సవాల్లో సోమ వారం ఉదయం పద్మావతిఅమ్మవారు రాజ మన్నార్ అలంకారంలో కల్ప వృక్షవాహ నంపై దర్శనమిచ్చారు. క్షీరసాగరమధనంలో విలువైన వస్తువులెన్నో ఉద్భవించాయి. వాటిలో కల్ప వృక్షం ఒకటి. ఈ చెట్టునీడన చేరినవారికి ఆకలి దప్పులుండవు. పూర్వజన్మస్మరణ కూడా కలుగు తుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. కల్పవృక్షం వాంఛిత ఫలాలన్నిటినీ ప్రసాదిస్తుంది. అటు వంటి కల్పవృక్షవాహనాన్ని అదిరోహించి ఆలయమాఢ వీధుల్లో అమ్మవారు కరుణా మయిగా కటాక్షించడం భక్తుల ఆనందానికి అవధుల్లేవు.

## నూతన వస్త్రాలు, రూపాయి హారతి దీపావళి ఆస్థానం - వెంకన్న ప్రత్యేక అలంకరణ



**తిరుమల,నవంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** దీపావళి పర్వదినాన కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి నూతన వస్త్రాలు ధరించి..రూపాయి హారతి అందుకోవడంతో దీపావళి ఆస్థానం జరిగింది. వైఖానస ఆగమోక్తంగా ఏడుకొండల స్వామి ఆలయంలో దీపావళి ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోపల బంగారువాకిలిలో గరుడాళ్వార్ సన్నిధిలో అభిముఖంగా ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు ఆలయంలోపల ఘంటా మండపంలో ఉత్సవ మూర్తులను, విశ్వక్సేనులను గరుడాళ్వారు సన్నిధిలో అభిముఖంగా కూర్చోబెట్టి దీపావళి ఆస్థానం చేపట్టారు. ఆనందనిలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామి మూలమూర్తికి, శ్రీదేవి భూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవ మూర్తులకు నూతన పట్టువస్త్రాలు అలంకరించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు స్వామి అమ్మవార్లు సహస్రదీపాలంకార సేవలో పాల్గొని ఆలయ నాలుగు మాఢవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.

ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాధమ్, టిటిడి న్యాయాధికారి జస్టిస్ వీరరాజు, ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, విఎస్ఒ నందకిశోర్, పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ ఉమామహేశ్వర్‌రెడ్డి,పిఆర్ఒ డాక్టర్ తలారి రవి అర్చకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల జిఓలో నిబంధనలు సడలించండి

## డిప్యూటీ సిఎం కొట్టుసత్యనారాయణకు తాడేపల్లిగూడెం జర్నలిస్టుల వినతి



**తాడేపల్లిగూడెం,నవంబర్13,ప్రభాతవార్త** జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల జీవోలో తగిన మార్పులు చేయాలని తాడేపల్లిగూడెంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవదాయ ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ కు విజ్ఞప్తి చేసారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేసారు. ఏపీయూడబ్ల్యూజే, తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా ఇటీవల జర్నలిస్టులకు 3 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించడం పట్ల డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ కు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించడం జరిగింది. అక్రిడిటేషన్ నిబంధనలో సడలింపులు ఇవ్వాలని, జర్నలిస్టు పేరు మీద గాని, అతని భార్య పేరు మీద గాని ఆస్తి ఉంటే ఇంటి స్థలం రాదనే షరతును తీసివేయాలని, 60-40 నిష్పత్తిలో కాకుండా నామమాత్రపు ధరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ కు విన్నవించడం జరిగింది. ఈ మేరకు రెండు రోజులు క్రితం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి కి రాసిన లేఖ ప్రతిని డిప్యూటీ సీఎం కొట్టుకు అందజేసారు. దీనిపై ఆయన స్పందిస్తూ అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాలో కూడా పెడథోరణులు పెరిగిపోయాయని, ఎమ్మెల్యేలు, ప్రభుత్వం పై లేనిపోని ఆరోపణలతో బురద జల్లడమే కొన్ని మీడియా సంస్థలు పనిగా పెట్టుకున్నాయని, ఇది ఎంతమాత్రం తగదన్నారు. ఇటువంటి మీడియా సంస్థల వలన మీడియా విశ్వసనీయత కోల్పోయిందని, ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అయినప్పటికీ అర్హులైన జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలని తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలియజేసారు.

# కేదార గౌరీ వ్రతానికి కదలి వచ్చిన భక్తులు మహిళల మనోభావాలకు గుర్తింపు

**శ్రీకాళహస్తి,నవంబర్ 13 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే పవిత్రమైన కేదార గౌరీ వ్రతానికి సోమవారం మహిళా భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. అంతేకాక వ్రతం సోమవారం రావటంతో మహిళా భక్తులకు వరంగా మారింది, ఆలయాధికారులు ముందుజాగ్రత్తగా రాయల వారి మండపంలో ఏర్పాట్లు చేసారు. పట్టణంలోని భక్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. మొదటి పూజలు ఉదయం 7గంటలకే ప్రారంభించారు. ఆలయాధికారి కె వి సాగర్‌బాబు దంపతులు, చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు హాజరయ్యారు.

**6వేల మంది వ్రత పూజలు:** ఈ సామూహిక కార్యక్రమాలకు సుమారు 6వేల మంది మహిళలు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలి వచ్చారు. వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా గతానుభవం ఉన్న ఎఇఒ ఏకే ధనపాల్ చక్కటి ప్రణాళికను రూపకల్పన చేసి ఆచరింపజేసారు. అమ్మవారి అలంకరణ అదరిపోయే విధంగా తీర్చి దిద్దారు. ఆలయ పౌరోహితులు, వేదపండితులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం ఏర్పాట్లను మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం నుంచే ఆలయంలో మహిళలు నోములు నోచుకోవటం కనబడింది. అయితే అధికారులు 'మహిళల మనోభావాలను గుర్తించి అమ్మవారి వద్ద ప్రసాదాలు సమర్పించటానికి' అనుమతించి మన్ననలను పొందారు. అంతేకాక సోమవారం మహిళలు తట్టలు పట్టుకొని రాగా వారిని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఒ వికె సాగర్‌బాబులు ఆహ్వానించారు.

**20 ఏళ్ళ నుంచి సామూహిక వ్రతం:** ప్రతి ఏడాది వేలాది మంది మహిళలతో నిర్వహించే కేదార గౌరీ



విశేషాలంకరణలో అమ్మవారు

వ్రతాన్ని ఆలయంలో సుమారు 20 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నారు. గతంలో పట్టణానికి చెందిన మహిళలు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు నోమునోచుకోవటానికి ఆలయానికి వచ్చే వారు. దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఆలయం ఎదుట అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి పసుపు దారాల్ని కట్టుకునే వారు. కాని మహిళా భక్తుల సంఖ్య పెరగటంతో ఈ వ్రతాన్ని సామూహికంగా నిర్వహించాలని గతంలో ఉన్న ధర్మకర్తల మండలి చైర్మెన్ కొండుగారి శ్రీరామమూర్తి హయాంలో సామూహిక కేదార గౌరీ వ్రతాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని సామూహికంగా నిర్వహించుటకు ప్రారంభించారు

**గ్రామాల నుంచి తరలి వచ్చిన మహిళా భక్తులు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహిళలకు సంబంధించిన ఉత్సవం 'కేదారగౌరీ వ్రతం' ఈ వ్రతానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మందిభక్తులు వస్తారు. దీనికి గాను ఆలయాధికారులు చక్కటి ఏర్పాట్లు చేసే వారు. ఏ ఏడాది ఏడాది మహిళా భక్తుల సంఖ్య పెరుగుతుంది. వచ్చిన కొందరు మహిళా భక్తులు ఆలయంలోనే ఎక్కడ బడితే అక్కడ ఏకాంతంగా కూర్చొని నోములు నోచుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద తట్టలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏర్పాటు చేసిన సామూహిక కేదార గౌరీ వ్రతాన్ని మహిళలు ఆచరించి ఆలయ ఆవరణలో భక్తి భావాన్ని పునీతం చేసారు. వ్రతానికి సంబంధించి ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వినిపించగా ఆలయ అభిషేక గురుకుల్ రాజేష్ గురుకుల్ పూజలు నిర్వహించగా ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్, పూజలు జరిపారు. ఏర్పాట్లును ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఒలు ధనపాల్, సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు, హారియాదవ్ తదితరులు పర్యవేక్షించారు.



# మొదటిఘాట్‌లో కొండను ఢీకొన్న కారు

**తిరుమల,నవంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలనుండి తిరుపతికి వెళుతున్న కారు అదుపుతప్పి మొదటిఘాట్‌లో చివరిమలుపు వద్ద గోడను ఢీకొంది. కారుడ్రైవర్ అతివేగం, అజాగ్రత్తకారణంగా జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు తమిళనాడు భక్తులకి స్వల్పగాయాలయ్యాయి.

ప్రమాదం జరగడంతో ఘాట్‌లో ట్రాఫిక్ స్తంభించింది. క్షతగాత్రులను టిటిడి విజిలెన్స్ సిబ్బంది స్విమ్స్‌కు తరలించారు.

# తాడేపల్లిగూడెంలో 23 కేజీల గంజాయి స్వాధీనం - ఇద్దరు వ్యక్తులు అరెస్టు

**తాడేపల్లిగూడెం,నవంబర్13,ప్రభాతవార్త** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో పోలీసులు 23 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని దానిని కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్.ఐ. కె.సుధాకర్ రెడ్డి సోమవారం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా ఎస్.పి. యు.రవిప్రకాష్, తాడేపల్లిగూడెం డిఎస్పీ శరత్ రాజ్‌కుమార్‌ల ఆదేశాలతో టౌన్ సి.ఐ. ఎస్.ఎస్.వి.నాగరాజు కు వచ్చిన పక్కా సమాచారం మేరకు ఈ దాడి నిర్వహించారు. పట్టణ శివారున ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఆదివారం గంజాయి కలిగి అక్కడ తచ్చాడుతున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి తరలిస్తున్న షేక్ అక్బర్, ఒరుగంటి షాలేంరాజు అనే ఇద్దరు యువకులను గంజాయితో పట్టుకున్నారు. వారి నుంచి 23 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టుకు హాజరుపరచనున్నారు.

మత్తు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, తమ జీవితాలను సన్మార్గంలో తీర్చిదిద్దుకోవలసిన గురుతరమైన బాధ్యత యువతపై ఉందన్నారు. ఈ దాడిలో మరొక టౌన్ ఎస్.ఐ. గరగ జ్యోతిప్రసాద్, హెడ కానిస్టేబుల్ జి.శ్రీను, కానిస్టేబుల్స్ సి. శ్రీనివాసరావు, కె.రాజు, కె.మహేష్ లు ఉన్నారు.

## కార్తీక శుద్ధ విదియ గాజుల అలంకారం

**ఇంద్రకీలాద్రి, నవంబర్ 13, ప్రభాతవార్త':** బెజవాడ దుర్గమ్మ ఆలయంలో 15న బుధవారం అమ్మవారికి గాజుల అలంకార వేడుక అత్యంత వైభవముగా నిర్వహించుటకు వైదిక కమిటి నిర్ణయించినందున శ్రీ అమ్మవారితో సహా ఆలయ ప్రాంగణము గాజుల అలంకారము వేడుక దీక్షాపూర్వకముగా నిర్వహించ బడుతుందని డిప్యూటీ కలెక్టర్ అండ్ ఆలయ ఈవో కెఎస్ రామారావు, ఏఈవో పి.చంద్రశేఖర్'లు తెలిపారు.

# సీమలో రైల్వే డబ్లింగ్ పనులు పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

**గుంతకల్లు రైల్వే, నవంబర్ 13 ప్రభాతవార్త** రాష్ట్రంలోని గుంటూరు-గుంతకల్లుల మధ్యడబ్లింగ్ రైలు మార్గం పనులు జరుగుతున్నందున, దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ డోన్-నంద్యాల సెక్షన్‌లో తిరిగే పలు రైళ్ల రాకపోకలను రద్దు చేయడం తోపాటు మరికొన్ని రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. డోన్-నంద్యాల సెక్షన్, డోన్-మల్కాపురం స్టేషన్‌ల మధ్య 12.84 కిలోమీటర్ల డబుల్ లైన్ రైలు మార్గం పనులను ఈ నెల 18 నుంచి 21 వరకు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించే ఈ ప్రీ-ఇంటర్ లాకింగ్, నాన్-ఇంటర్ లాకింగ్ సాంకేతిక పనుల ద్వారా నూతనంగానిర్మించిన ఈ డబుల్ లైన్ రైలు వర్గాన్ని రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయనున్నారు. గుంటూరు- కాచిగూడ-గుంటూరుల మధ్య తిరిగే నెంబర్ 17251/52, హుబ్లీ నుంచి విజయవాడ వెళ్లే నెంబర్ 17329, మచిలీపట్నం నుంచి మంత్రాలయం వెళ్లే నెంబర్ 07067 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రద్దు చేశారు.

**ఈ నెల 19 న ఉంచి 21 వరకు రద్దు చేసి రైళ్లు :** గుంతకల్లు-డోన్‌ల మధ్య తిరిగే నెంబర్ 07288 ప్రత్యేక ఎక్స ప్రెస్, డోన్-గుత్తి-డోన్‌ల మధ్య తిరిగే నెంబర్07289/90, డోన్-కర్నూలుల మధ్య తిరిగే నెంబర్ 07291, కర్నూలు-నంద్యాల-కర్నూలుల మధ్య తిరిగే నెంబర్ 07499/98, కర్నూలు-గుంతకల్లు మధ్య తిరిగే నెంబర్ 07292, గుంటూరు- సికింద్రాబాద్-గుంటూరుల మధ్య తిరిగే నెంబర్ 17253/54, విజయవాడ-హుబ్లీ మధ్య తిరిగే నెంబర్ 17330, గుంటూరు-డోన్-గుంటూరుల మధ్య తిరిగే నెంబర్ 18228/27, ఈ నెల 19న మంత్రాలయం నుంచి మచిలీపట్నం వెళ్లే నెంబర్ 07068 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రద్దు చేశారు.

**దారి మళ్లించిన రైళ్లు :** మచిలీపట్నం నుంచి యశ్వంతపూర్ వెళ్లే నెంబర్ 17211, ఈ నెల 21న యశ్వంతపూర్ నుంచి మచిలీపట్నం వెళ్లే నెంబర్ 17212 కొండవీడు ఎక్స ప్రెస్ రైలు సర్వీసులను నంద్యాల, ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్, ధర్మవరం మీదుగా మళ్లించారు. ఈ నెల 18, 21 తేదీల్లో రేణిగుంట నుంచి హజరత్ నిజాముద్దీన్‌కు బయల్దేరే నెంబర్ 00761, ఈ నెల 19న, హజరత్ నిజాముద్దీన్ నుంచి రేణిగుంటకు బయల్దేరే 00762 ఎక్స్‌ప్రెస్ రైళ్లను రేణిగుంట, గూడూరు, విజయవాడ, వరంగల్లు మీదుగా మళ్లించారు. యశ్వంతపూర్ నుంచి పూరి వెళ్లే నెంబర్ 22884 పూరి వీక్లీ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌ను, ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్‌ల మీదుగా మళ్లించారు.

# పెట్రోలు పోసుకుని మహిళ ఆత్మహత్య

## కాపాడబోయిన భర్త మృతి, కుమారుడికి గాయాలు

### - పరామర్శించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బండారు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, కొత్తపేట, నవంబర్ 13, ప్రభాతవార్త :** దీపావళి పండుగ వేళ అంతా ఆనందంలో ఉండగా ఆ ఇంట్లో మాత్రం విషాదం. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం అవిడి కట్టమ్మ కాలనీలో ఆదివారం రాత్రి పెదపూడి మంగాదేవి (42) అనే మహిళ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఆమెతో పాటు కాపాడేందుకు ప్రయత్నం చేసిన భర్త ఆదినారాయణ మృతి చెందారు. కుమారుడు ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదినారాయణ సోమవారం మృతి చెందాడు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. స్థానికంగా వీరు లూజు పెట్రోల్ అమ్ముతారని స్థానికులు చెబుతున్నారు. కొత్తపేట ఎస్సై వి.మణికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా అడిషనల్ ఎస్పి ఖాదర్ భాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి క్షతగాత్రుల పరిస్థితిని వైద్యులను అడిగి తెల్సుకున్నారు. కొత్తపేట మండలం అవిడి గ్రామంలో భార్య భర్తలు పెదపూడి ఆదినారాయణ, పెదపూడి మంగాదేవిలు మృతి చెందడం పట్ల ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పెదపూడి మంగాదేవి, ఆదినారాయణ మృతదేహాలను పరిశీలించారు. గాయపడిన ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెల్సుకున్నారు. అలాగే కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆదివారం రాత్రి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కొత్తపేట నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించారు. వివరాలను అడిగి తెల్సుకున్నారు.

# కెమికల్ ఫ్యాక్టరీని మూసివేయాలని స్థానికుల ఆందోళన

## - డిసెంబర్ 31 నాటికి మూసివేస్తామని హామీ

**జగ్గయ్యపేట, నవంబర్ 13, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామ శివార్లలోగల గ్రీన్‌టెక్ ఎన్విరో సొల్యూషన్ కెమికల్ ఫ్యాక్టరీ తక్షణమే మూసివేయాలని నినాదాలు చేస్తూ గ్రామ ప్రజలు సోమవారం ఫ్యాక్టరీ ట్యాంకర్ లారీని అడ్డగించి ఆందోళన చేపట్టారు. గతంలో పలు మార్లు ఫ్యాక్టరీ మూసివేస్తామని చెప్తూ కాలం వెళ్లదీస్తూ కాలుష్యాన్ని వెదజల్లటం ఆపకుండా కొనసాగిస్తున్నారని, ఆయుష్షు-ఆరోగ్యాలను హరిస్తున్న ఈ కాలుష్యాన్ని నివారించాలంటే నిబంధనలు పాటించని కెమికల్ ఫ్యాక్టరీని మూసివేయటమే మార్గమంటూ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు సైతం ప్రజలకు మద్దతుపలికాయి. ఆందోళన సమాచారం తెలుసుకున్న చిల్లకల్లు ఎస్ఐ కృష్ణబాబు వచ్చి గ్రామ ప్రజలతో మాట్లాడి ఫ్యాక్టరీ యాజమాన్యాంతో సెల్‌ఫోన్‌లో సంప్రదించారు. ఈనెల 20వ తేదీన గ్రామానికి వచ్చి, డిసెంబర్ 31 నాటికి ఫ్యాక్టరీని ఇక్కడి నుండి తరలిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని ఎస్ఐ తెలియజేస్తూ ఆందోళన విరమించాలని కోరారు. ఎస్ఐ ఇచ్చిన హామీతో ప్రజలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోట కృష్ణ, సోమోజు రామనాథం, షేక్ గౌస్‌మియా, దంతాల నరేంద్ర, జె వెంకట్రావు, బాలు, గ్రామస్తులు సుహాసిని, శ్రీలక్ష్మి, తిరపయ్య, సైదులు, ఎల్లయ్య, వెంకటరత్నం, బిజెపి నాయకులు, న్యాయవాది అన్నెపాక ప్రఫుల్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కాలుష్యాన్ని వెదజల్లుతున్న కెమికల్ ఫ్యాక్టరీని మూసివేయాలని ఆందోళన చేస్తున్న ప్రజులు

# వైఎస్సార్సీ ఆరోగ్యశ్రీ పథకం నూతన ప్రొసీజర్లు ప్యాకేజీ పెంచాలి

## - బకాయిలు 27లోపు చెల్లించాలి - ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి లేఖ

**విజయవాడ,నవంబరు13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీపథకం పరిధిలో నూతనంగా పెంచిన ప్రొసిజర్స్‌కు ఇస్తున్న ప్యాకేజీ పెంచాలని ఆ పరిధిలోని ప్రైవేటు హాస్పిటల్స్ కోరుతున్నాయి. ఆ మేరకు ప్రభుత్వానికి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోషియేషన్ వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ముద్దాడ తిరుమల కృష్ణబాబు లేఖ రాసినట్లు కీలక సమాచారు. ఆరోగ్యశ్రీ ఆస్పత్రులపై 92శాతం మంది ప్రజలు ఆధారపడుతున్నారని ఈ లేఖలో వివరించారు. ఆరోగ్యశ్రీ పరిధిలో తాజాగా పెంచిన ప్రొసిజర్లుతో కలిపి 3,200ల వైద్య సేవలు అమలు చేయాల్సివుందని పేర్కొన్నారు. గతంతో పోల్చుకుంటే చికిత్సల ధరలు 100శాతం కంటే ఎక్కువ పెరిగాయని లేఖలో వివరించారు. దీని వలన నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో తీవ్రమైన ఆర్ధిక భారం పెరిగిందని లేఖలో వివరించారు.


ఈ అంశంపై పలు పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి వెళ్ళినా, పరిష్కరించే వైద్యఆరోగ్య స్పందించలేదని స్పష్టం చేసారు. దీనికి తోడు గత ఆరునెలలకు ప్రభుత్వంఆరోగ్యశ్రీ పరిధిలో రూ.1000 కోట్లు బకాయిలు ఉన్నాయని లేఖలో వివరించారు. ఇంత మొత్తంలో బకాయిలుండటం వలన అన్నింటి ఇబ్బంది పడుతున్నామని లేఖలో వివరించారు. ఈ పరిస్థితుల్లో తమ సేవలు కొనసాగించడం కష్టంగా ఉంటుందని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోషియేషన్ తన లేఖలో స్పష్టం చేసింది. ఈ నెల 27వలోపు తమకు నిధులు విడుదల చేసి సహకరించాలని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోషియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. నిధులు లేకుండా ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించలేమని వివరించింది.

# తల్లికి వందనం..ఆడబిడ్డ నిధి

≫ ప్రతిపాదించగా ఆమోదించినట్టు తెలిపారు. దీన్ని జత చేశామన్నారు. అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు, మరియు కౌలు రైతుకు ఏటా రూ.20వేలు ఆర్థికసాయం కల్పించటం, హార్టికల్చర్ సాగుకు రాయితీలు ఇవ్వటం, పాడి రైతులకు నేరుగా ప్రోత్సాహకాలు కల్పించటం, ఇంటింటికీ మంచినీరు పథకం కింద ప్రతి ఇంటికి రక్షిత మంచినీటి కుళాయి కనెక్షన్, బిసిలకు రక్షణ చట్టం ద్వారా బిసిలకు రక్షణ కల్పించి వారికి అన్నివిధాలా అండగా ఉండటం , సంపన్న ఆంధ్రప్రదేశ్ పథకం ద్వారా అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పన్నుల, ధరల భారాన్ని , విద్యుత్ చార్జీలను తగ్గిస్తూ మౌలిక వసతులను అభివృద్ధి పరచటం, రాష్ట్ర స్థూల ఉత్పత్తిని మెరుగుపరచే విధంగా చర్యలు తీసుకోవటం, పూర్ టు రిచ్ పథకం ద్వారా పేదలను సంపన్నులను చేస్తే పీ4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) . ఐదేళ్లలో కనీస రెట్టింపు ఆదాయం, అమరావతే రాజధానిగా ప్రకటిస్తూ ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాన్ని కొనసాగిస్తూ అన్ని ప్రాంతాల అభివృద్ధి, ఉచిత ఇసుక పథకాన్ని పునరుద్ధరిస్తూ, పేదల సొంతింటి కలను నెరవేర్చటం, భవన నిర్మాణ రంగాన్ని ఆదుకోవటం , కార్మికుల సంక్షేమం ద్వారా కనీస వేతనాలను పెంపొందించటం, వలసలను నివారించటం వంటి పథకాలను ఈ ప్రిలిమినరీ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇన్ క్లోజివ్ గ్రోత్ చాలా అవసరమని, పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు పేదరికాన్ని ఏ విధంగా నిర్మూలించాలి.. అదేదిశగా పయనిస్తామని తెలిపారు.. ఆర్థికపరమైన సహాయాన్ని అందిస్తామని, పేదరికం, అసమానతలు పెరు గుతూ పోతున్నాయని, వాటిని రూపుమాపాల్సి ఉందన్నారు. జనసేన తరపున ముత్తా శశిధర్ మాట్లాడుతూ, మంచి వాతావరణంలో టిడిపి-జనసేన మేనిఫెస్టో కమిటీ సమావేశం జరిగిందన్నారు.. వైనాట్ 175 అంటూ జగన్‌రెడ్డి చెబుతుంటే, ప్రజలు ఎందుకు వైకాపాకు 151 సీట్లు ఇచ్చామని నవ్వుకుంటున్నారని అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండానే, మేనిఫెస్టోని అమలు చేశామని ప్రజలను మోసగించటమే కాకుండా మేనిఫెస్టో విధానాన్నే అపహాస్యం చేస్తున్నారని అన్నారు.. మహానాడులో టిడిపి ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలతోపాటు గత నాలుగు సంవత్సరాలుగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రజా పోరాట్లో పాల్గొన్న సమయాల్లో కొన్నివర్గాల నుంచి, వైకాపా ప్రభుత్వంలో నష్టపోయిన బాధితులు, పేదప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు జనసేన కూడ ఆరు ప్రతిపాదనలు చెప్పటం జరిగిందన్నారు. సంపన్న ఆంధ్రప్రదేశ్- అమరావతే రాజధాని, ఉచిత ఇసుక ద్వారా పేదలకు ఇల్లు నిర్మించటంతోపాటు భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించటం, జనసేన సౌభాగ్యపదం ద్వారా నిరుద్యోగ యువతను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసి ఎక్కడికక్కడ ఉద్యోగాలు కల్పించటం, వ్యవసాయాన్ని భాగ్యపథంగా తీసుకెళ్లటం ద్వారా రైతులు, కౌలు రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చటమేనన్నారు.

# ఒక్కొక్కరి అంతుచూస్తాం - ఇసుకలో దోచుకున్నదంతా బయటికి తీస్తాం - మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

**అమరావతి, నవంబర్ 13, ప్రభాతవార్త ప్రతినిధి:** భవన నిర్మాణ కార్మికులను ఆర్థాకలితో అలమటించేలా వైకాపా ప్రభుత్వం చేసిందని మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు మండిపడ్డారు.. సోమవారం తెదేపా జాతీయ కార్యాలయంలో ఆయనమీడియాతో మాట్లాడారు.. రాష్ట్రంలో సామాన్యుడికి ఇసుక అందుబాటులో లేకుండా పోయిందన్నారు. మద్యం, ఇసుక రెండు కళ్లుగా జగన్‌రెడ్డి భావిస్తున్నారని అన్నారు.. మద్యం, ఇసుకయే రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా మారిందన్నారు.. తాడేపల్లి ప్యాలెస్‌కు క్యాష్ వెళ్లాలంటే మద్యం, ఇసుక ఉండాలన్నారు. రాష్ట్రంలో ఇసుక కుంభకోణంలో అక్షరాలా 50వేల కోట్ల కుంభకోణం జరిగిందన్నారు.. నాలుగున్నర సంవత్సరాల్లో ఒక ఏడాదిపాటు ఇసుక పాలసీని రాష్ట్రంలో లేకుండా నడిపారని దుయ్యబట్టారు.. ఈ ఒక్క ఏడాదితోపాటు సిఎం, మంత్రులు, వైకాపా ఎమ్మెల్యేలు ఇతర అధికారులు అడ్డగోలుగా



దోచుకున్నారని దుయ్యబట్టారు.. భవన నిర్మాణ రంగాన్ని కుదేలు చేశారని ఆరోపించారు.. దాదాపు 45 లక్షల భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టారన్నారు. సంవత్సరం తర్వాత ఇసుక పాలసీ తెచ్చి జెపీ వెంచర్స్ అనే ఒక బినామీ కంపెనీని తెచ్చారని, ఆ సంస్థను అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా దోపిడీ చేశారన్నారు.. వైకపా నాయకుల అడ్డగోలు విధానలు, దోపిడీ భరించలేక జెపి వెంచర్స్ మధ్యలో టర్న్‌కీ అనే ఒక సంస్థను తీసుకొచ్చారన్నారు.. ఆ సంస్థ కూడా ఒక ఏడాదిపాటు ఒక సబ్‌కాంట్రాక్టు నిర్వహించి వారుకూడా పక్కకు తప్పుకున్నారని అన్నారు.. ప్రభుత్వం , ప్రభుత్వ పెద్దలు, మైనింగ్ డైరెక్టర్‌గా ఉన్న వెంకట్‌రెడ్డి , జగన్ ప్యాలెస్ సిబ్బంది ఏజెంట్లను పెట్టుకుని అడ్డగోలు దోపిడీకి తీరతీశారన్నారు. 40 వేల కోట్ల ఇసుకలో దోచిన వైనాన్ని చంద్రబాబు గతంలోనే ఎండగట్టటం జరిగిందన్నారు. జెపీ వెంచర్స్‌కు ఇచ్చిన కాంట్రాక్టు మే నెల 12వతేదీతో ముగిసిందని, ఒప్పంద పత్రాలు కూడ మేం ఆ రోజు చూశామన్నారు.. ఒప్పందం మగిసి 6 నెలలు అవుతోందన్నారు.. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలన్నీ నిలిపివేయాలని మార్చి నెలలో నేషనల్‌ట్రిబ్యునల్ నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు.. ఇసుక అనుమతుల్ని కూడ రద్దుచేసిందన్నారు. స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్టు అసిస్టెంట్ అథారిటీ అనుమతులన్నీ రద్దు చేశామని తెలిపారు. వెంకటరెడ్డి తన ఇంటినే ఆఫీసుగా మార్చిఇసుకతో డబ్బుకొల్లగొడుతున్నారాన్నరు.

# క్రికెట్ బెట్టింగ్‌లో అప్పులపాలై సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

**రొంపిచర్ల (పల్నాడుజిల్లా),నవంబర్13 ప్రభాతవార్త :** మండలంలోని అలవాల గ్రామానికి చెందిన బి గంగిరెడ్డి (34) బలవన్మరణానికి పాల్పడ్డారు. పూర్తి వివరాలు గ్రామస్తులు తెలిపారు. గంగిరెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఏడాది క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం ఐదు నెలల పసిపాప ఉంది. గంగిరెడ్డి క్రికెట్ బెట్టింగ్ ఆడే వాడని చెప్పుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన అధిక వడ్డీలతో అప్పులపాలయ్యారని అంటున్నారు. క్రమంగా ఆయనపై వత్తిడి పెరగటంతో ఆర్థికంగా మానసికంగా కుంగిపోయారు. చివరకు పల్నాడు జిల్లాలోని సాతులూరు వద్ద రైలు పట్టాలపై తనువు చాలించారు. మృత దేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

